నిధుల వినియోగంలో నరసాపురం ప్రథమం

- రూ 2.06 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- చీఫ్‌విప్, ఎమ్మెల్యే ప్రసాదరాజు



రుస్తుంబాద తాగునీటి ప్రాజెక్టు వద్ద రాపిడ్ వాటర్ ఫిల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రసాదరాజు

నరసాపురం రూరల్: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా వచ్చే నిధుల వినియోగంలో రాష్ట్రంలోనే నరసాపురం నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామంలో రక్షిత తాగునీటి పథకం (సీపీడబ్ల్యూఎస్ స్కీం) వద్ద రూ.2.06 కోట్లతో నిర్మించే రాపిడ్ వాటర్ ఫిల్టర్ బెడ్ యూనిట్, సంపు, పైప్‌లైన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో 45 గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.67 కోట్ల నిధులు మంజూరు చేయించి, కొత్త పైప్‌లైన్ నిర్మాణంతోపాటు ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ పనులు చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో ఉన్న ఆరు సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మంచినీటి సరఫరాలో ఉన్న లోటుపాట్లను సరిచేసేందుకు ప్రత్యేకంగా సీపీడబ్ల్యూస్ స్కీం మరమ్మతులు, అభివృద్ధి పనులకు సుమారు రూ.17 కోట్లు నిధులు ఖర్చుచేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తులో స్వచ్ఛమైన మంచినీరు ప్రజలకు పుష్కలంగా అందుతుందని అన్నారు. ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలోని ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు అధిక సంఖ్యలో సుమారు 135 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. విజ్జేశ్వరం నుంచి నేరుగా గ్రామాలకు తాగునీటని పైప్‌లైన్ల ద్వారా తీసుకొచ్చి శుద్ధిచేసిన మినరల్ వాటర్‌ను ప్రతి ఇంటికి అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సుమారు రూ.1400 కోట్లతో చేపట్టనున్న వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులకు నరసాపురంలో శంకుస్థాపన చేసిన విషయాన్ని ముదునూరి గుర్తుచేశారు. వాటర్ గ్రిడ్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఆ పనులు పూర్తయితే భవిష్యత్తు రోజుల్లో నియోజకవర్గ ప్రజలకు ఒక పూట మినరల్ వాటర్, మరోపూట సీపీడబ్ల్యూఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ స్కీంల ద్వారా నీరు సరఫరా చేయవచ్చని వివరించారు. ప్రసాదరాజు వెంట ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాదాకృష్ణ, జెడ్పీటీసీ బొక్కా రాధకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేష్, దొంగ మురళీకృష్ణ, చినమిల్లి చంద్రశేఖర్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రహదారుల అభివృద్ధిపై దృష్టి

నరసాపురం రూరల్: నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధిపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది ఉన్నచోట అత్యవసర మరమ్మతులు చేపట్టాలన్నారు. మోడి, వేములదీవి, కరింశెట్టి పాలెం, తూర్పుతాళ్ల మీదుగా లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, దర్భరేవు రహదారి నిర్మాణం, నరసాపురం మున్సిపాలిటీ నుంచి లక్ష్మణేశ్వరం మీదుగా సారవ రహదారి నిర్మాణం తీరం వెంబడి మెగ్రేవు నుంచి అల్లం వారి మెరక, కెపీపాలెంసౌత్ మీదుగా పేరుపాలెం సౌత్ రహదారి నిర్మాణాలకు సంబంధించి సుమారు రూ.15 కోట్లు మంజూరు కాగా టెండర్ల దశ పూర్తి చేసుకుని పనులు ప్రారంభించాలని అన్నారు. టెండరు ప్రక్రియ పూర్తయిన పనులను వెంటనే మొదలు పెట్టాలన్నారు. చేపట్టిన పనుల పురోగతిపై ఆరా తీసి వాటిని మరింత వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నూతన నిర్మాణాలు చేపట్టడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ జీవీఎస్ కిరణ్‌కుమార్, ఏఈ నిక్కీక్రజ్ ఉన్నారు.

నూర్‌బాషా జిల్లా మహిళా అధ్యక్షురాలుగా చాంద్‌బీబీ



షేక్ చాంద్ బీబీ

పాలకొల్లు అర్బన్: నూర్‌బాషా సంక్షేమ సంఘ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా పాలకొల్లు పట్టణానికి చెందిన షేక్ చాంద్ బీబీ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాజీ ఉత్తర్వులిచ్చినట్టు చాంద్‌బీబీ సోమవారం విలేకర్లకు తెలిపారు. ఇప్పటి వరకు ఈ పదవి ఆరుసార్లు తాను నిర్వహించినట్టు చెప్పారు. చాంద్‌బీబీని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు, ముస్లిం సంఘ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ అనిల్ కిరణ్

మొగల్తూరు: మండలంలోని కేపీపాలెం నార్త్ ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు అనిల్ కిరణ్ సుమారు 60 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను పరీక్షించి, లేవలేని స్థితిలో ఉన్న రోగులను వారి ఇంటికి వెళ్లి తగు సలహాలు, సూచనలు అందజేశారు. జి.చంద్రశేఖర్, అశ్రిత, త్రివేణి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పునఃప్రవేశం



విద్యార్థినికి పునఃప్రవేశం కల్పిస్తున్న ఎంఈఓ

పాలకొల్లు అర్బన్: పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు పునఃప్రవేశం కల్పించారు. మండలంలోని శివదేవునిచిక్కాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆ పాఠశాల పరిధిలో గతేడాది పదో తరగతి ఫెయిల్ అయి పాఠశాల మానేసిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో ప్రవేశం కల్పించారు. బల్లిపాడు, బల్లిపాడు గరువు, జొన్నల గరువు, తిల్లపూడి గ్రామాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులను పాఠశాలలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గుమ్మళ్ల వీరాస్వామి, పాఠశాల హెచ్ఎం పి.రాము, పాఠశాల ఇన్‌చార్జి ఎ.సత్యనారాయణ, వీఎస్ఎస్ మూర్తి, ఊట నరేంద్ర, గూట్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పోరాట వీరులకు నివాళి



పెనుగొండలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: టీడీపీ ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ చార్జీలు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన వీరులకు సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సోమవారం అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన రెడ్డి, బాలస్వామిల 23వ వర్ధంతిని పెనుగొండలో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా పోలీస్‌కు సన్మానం



మహిళాపోలీస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని వైఎస్సార్‌సీపీ మొగల్తూరు అధ్యక్షుడు కర్రి ఏసు, ఏఎంసీ వైస్ చైర్మన్ కటికల సూర్యారావు తదితరులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ మహిళా పోలీస్ అవార్డు అందుకున్న పేరుపాలెం సచివాలయ ఉద్యోగిని తోట శిరీషను సోమవారం సన్మానించారు. పేరుపాలెం నార్త్ ఉప సర్పంచ్ చల్లా రామరాజు సొసైటీ అధ్యక్షుడు బర్రి సీతారామరాజు, పార్టీ నాయకులు డాక్టర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో వీధిలైట్ల ఏర్పాటు ప్రారంభం

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపి



టిడ్కో కాలనీలో వీధిలైట్లను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గోపి



గోపిని సత్కరిస్తున్న మాదిగ సంఘ నాయకులు

పాలకొల్లు అర్బన్ : టిడ్కో కాలనీలో ఏ సమస్య ఉన్నా తక్షణం పరిష్కరిస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. సోమవారం ఆయన కాలనీని ఆకస్మిక తనిఖీ చేశారు. గతవారం వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరినా ఇప్పటి వరకు ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతం తాను కాలనీలో ఉన్నానని వీధిలైట్లు తీసుకుని రావాలని ఆదేశించారు. దీంతో మునిసిపల్ అధికారులు అప్పటికప్పుడు వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వీధిలైట్ల ఏర్పాటు పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మునిసిపల్ సాధారణ నిధులు రూ.4.56 లక్షలతో 86 వీధిలైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ పనులు రెండు రోజుల్లో పూర్తవుతాయని మునిసిపల్ అధికారులు గోపికి వివరించారు. టిడ్కో కాలనీ వాసుల సౌకర్యార్థం కాలనీలో ఒక ఉద్యోగిని నియమించి మునిసిపల్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభించాలని మునిసిపల్ కమిషనర్‌కి ఆదేశాలిచ్చారు. కాలనీలో పేరుకుపోయిన చెత్త తొలగింపు చర్యలను తక్షణమే చేపట్టాన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని అధికారులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, వార్డు ఇన్‌చార్జీలు, కాలనీ శాంతి కమిటీ సభ్యులు విజయ దుర్గాభవాని, రమ్య, లక్ష్మి, బ్రహ్మయ్య, మురళి, సుబ్రహ్మణ్యం, నాగరాజు పాల్గొన్నారు.

పదవుల్లో మాదిగలకు ప్రాధాన్యత

నామినేటెడ్, పార్టీ పదవుల్లో మాదిగలకు ప్రాధాన్యత కల్పిస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి హామీ ఇచ్చారు. పాలకొల్లు ఏఎంసీ అతిథి గృహంలో సోమవారం వైఎస్సార్ సీపీ మాదిగ సంఘం నియోజకవర్గ నాయకులు గోపిని కలిసి తమ సమస్యలను వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడానికి మాదిగలు అండగా నిలిచారని గుర్తుచేశారు. పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల నియామకంలో మాదిగలకు, మాదిగలు నివాసం ఉంటే ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు, డ్రెయినేజీలు ఇతర అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుల్లోనూ న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా గోపిని పార్టీకి చెందిన మాదిగలు గజమాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చుట్టుగుళ్ల ఆంజనేయులు, పార్టీ నాయకులు ఖండవల్లి వాసు, ముమ్మిడివరకు ఆంజనేయులు, రామాంజుల పెద మధు, పసుపులేటి వీరాస్వామి, మడికి విక్రమ్, బొందపల్లి గిరిజ, మాముదూరు నాగమణి, దిగమర్తి అబ్బులు, లంక చిరంజీవి, మాదాసు జయరావు, ఉండ్రాజవరపు రవికుమార్, శిర్రా నాగరాజు, కెజక్కరయ్య, ఆకుమర్తి సుగుణరావు, శిర్రా కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా వేపచెట్టు



పాలకొల్లు సెంట్రల్: వర్షానికి మూడు రోజుల క్రితం స్థానిక బంగారువారి చెరువుగట్టు సాయినగర్ కాలనీ మొదటి వీధిలో వేపచెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీనిని తొలగించకపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చెట్టు తొలగించాలని వారు కోరుతున్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత



తూర్పుపాలెంలో నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: గ్రామాల్లో మురుగు సమస్య పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. సోమవారం తూర్పుపాలెం నాయకులు, అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రతి సచివాలయం పరిధిలోనూ గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇప్పటికే రూ.20 లక్షలు నిధులు కేటాయించామన్నారు. వీటితో పలు సచివాలయాల పరిధిలో ఇప్పటికే పనులు పూర్తిచేశామని చెప్పారు. మరికొన్ని ప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈ నిధులకు తోడు మరో రూ.20 లక్షలు అదనం కేటాయించామని తెలిపారు. వీటితో ముఖ్యంగా డ్రెయినేజీ సమస్యల పరిష్కారం, రహదారుల నిర్మాణం చేపడతామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పార్టీ ఐక్యతకు కృషి చేయాలి

నూతనంగా జిల్లా స్థాయి పదవులు పొందిన నాయకులంతా పార్టీ పటిష్టతకు, ఐక్యతకు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సూచించారు. జిల్లా అధ్యక్షుడుగా మరోసారి పదవి చేపట్టడంతో పలువురు ఆయన్ని అభినందించారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, పార్టీ నాయకులు నూలి తాతాజీ, మేడపాటి చిరంజీవి రెడ్డి, దేవరపు సూర్యనారాయణ, కోట వెంకటేశ్వరరావు, కర్రి వేణుబాబు, సత్తి వెంకట రెడ్డి, మేడిచర్ల పండు, దంపనబోయిన హరి, రామచంద్రరావు పాల్గొన్నారు.

యాళ్లవానిగరువులో బస్ షెల్టర్ ప్రారంభం



యాళ్లవానిగరువులో బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గోపి

పాలకొల్లు అర్బన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ విజయం సాధించేందుకు నాయకులంతా సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ విరాళంతో తల్లిదండ్రులు సూర్యప్రకాశరావు – కృపమ్మ జ్ఞాపకార్థం యాళ్లవానిగరువు (దొడ్డిపట్ల రోడ్డు)లో రూ.3 లక్షలకుపైగా వ్యయంతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను గోపి ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం తన సొంత సొమ్ముతో బస్ట్ షెల్టర్ నిర్మించినట్టు ఆనందప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కిట్ల పంపిణీ



గుంపర్రులో రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లు అందిస్తున్న సర్పంచ్ అమూల్య

యలమంచిలి: మండలంలోని గుంపర్రు, కాంబోట్లపాలెం, చింతదిబ్బ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తోన్న 60 మంది రైతులకు సోమవారం మండల వ్యవసాయ అధికారి చిండులూరి దేవి గుంపర్రు సర్పంచ్ తుంగా అమూల్య చేతుల మీదుగా ప్రకృతి వ్యవసాయ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ రైతులంతా రసాయనిక వ్యవసాయం మానివేసి, తమకున్న పొలంలో కనీసం 30 నుంచి 50 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. పొలం గట్లు, ఇంటి పెరటిల్లోనూ కాయకూరల సాగు చేయాలన్నారు. అనంతరం రైతులకు సర్పంచ్ అమూల్య, వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్ బొంతు వెంకట కర్తారెడ్డిలు వేప పిండి, పాల ఇంగువ, కోడి గుడ్డు నిమ్మరసం, పసుపు, తెలుపు పళ్లాలు, లింగాకర్షక బుట్టలు, కిచెన్ గార్డెన్ విత్తనాలు, జీవామృతం తయారీ సంచి, అజోల, బయో కల్చర్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.జ్యోతి, జడ్డు లక్ష్మీనారాయణ, బండి లక్ష్మీదుర్గ, కె.శాంతి రైతులు గణపాబత్తుల ఏసుబాబు, జడ్డు సత్యనారాయణ, కపురు మీరారావు, ఎ.రవీంద్ర, గ్రామ కార్యదర్శి మన్నే మాధురి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

స్వర్ణకిరీటం సమర్పణ

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా ఆలయంలోని ఉత్సవ విగ్రహానికి భక్తుడు మంతెన సాయి కనక వెంకట రామరాజు సుమారు రూ.1.40 లక్షల విలువైన మూడు కాసుల స్వర్ణ కిరీటాన్ని సోమవారం బహూకరించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోరం అనంతలక్ష్మీ సత్యవతిదేవి దాత కుటుంబ సభ్యులకు బాబా ప్రత్యేక దర్శనం కల్పించారు.

మేడపాడు సర్పంచ్‌ను పరామర్శించిన గోపి



మేడపాడులో సర్పంచ్ శాంతకుమారిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపి

యలమంచిలి: అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతోన్న మేడపాడు సర్పంచ్ గంటా శాంతకుమారి స్వగ్రామం వచ్చారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సోమవారం మేడపాడు వచ్చి సర్పంచ్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవలో నిర్విఘ్నంగా పాల్గొనాలని ఆకాంక్షించారు. గోపి వెంట పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ, నాయకులు గంధం సత్యకీర్తి, కుక్కల సూరయ్య, అడబాల రామ్మోహనరావు, వర్ధనపు వెంకటేశ్వరరావు, దేగల వెంకటేశ్వరరావు, కుక్కల బాలచంద్రన్, గాది వరదయ్య, ఉండ్రాజవరపు ఆంజనేయులు, పెచ్చెట్టి సత్యనారాయణ, గుత్తుల వెంకట్రావు, ముద్దల వీరన్న తదితరులు ఉన్నారు.

సీఐ సోదరులకు సత్కారం



సిద్ధాంతంలో సీఐ సోదరులకు సత్కారం

పెనుగొండ: తల్లిదండ్రులు, గురువుల ఆశీర్వదం, స్నేహితుల ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి చేరుకొన్నట్టు సిద్ధాంతం గ్రామానికి చెందిన సీఐ సోదరులు వాసా పెద్దిరాజు, వాసా వెంకటేశ్వరరావులు అన్నారు. సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పెద్దిరాజు మచిలీపట్నం డీసీఆర్‌బీ సీఐగా, వెంకటేశ్వరరావు ఇటీవలే సీఐగా ప్రమోషన్ పొందారు. ఈ సందర్భంగా వారిని సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. సిద్ధాంతం నుంచి డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ రవికాంత్ ఎన్నో సూచనలు చేస్తుంటారన్నారు. అదేవిధంగా గురువుల శ్రీను, వెంకటేశ్వరరావు, అంజిబాబులు వెనుక ఉండి సామర్థ్యాన్ని గుర్తించి ఉన్నత స్థాయికి చేర్చారని వివరించారు. తల్లిదండ్రులు వాసా నగరయ్య, అక్కమాంబలను పలువురు వ్యక్తులు కొనియాడారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రాజారావు, కంచర్ల గుప్తా, బొక్కా మార్కండేయులు, పేరూరి నాగు, సానబోయిన అనిల్, గుత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



వడలిలో మన దేవాలయం మన హక్కు కార్యక్రమంలో సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

పెనుగొండ: వడలిలో సోమవారం శివాలయం వద్ద మన దేవాలయం మనహక్కు కార్యక్రమం నిర్వహించారు. హిందూ పవిత్రతను కాపాడాలంటూ సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో ఉప్పలపాటి చంటి, ముత్యాల్య వెంకట సురేష్, దొడ్డిపట్ల నాగూర్, రంభ రామారావు, ఆచంట ఆంజనేయులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సాక్షి, భీమవరం: టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవరం ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.అప్పారావు చెప్పారు. ఉండి రోడ్డులోని కారుల షెడ్‌లో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగుర్ని అరెస్టు చేసి వారి నుంచి రూ.17,240 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

క్లుప్తంగా

శేషుబాబుకు అభినందనలు



శేషుబాబును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పోడూరు: టీటీడీ పాలకమండలి సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబును సోమవారం ఆయన కార్యాలయంలో జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. శేషుబాబును దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. శేషుబాబు రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, పెనుమదం సొసైటీ చైర్మన్ కొత్రపాటి వీరాస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుంటూరి చంటిరాజు, దొమ్మేటి ఏడుకొండలు, నాగరాజు బాలాజీవర్మ, వడ్లపాటి సురేష్, అల్లు మురళి, అందే నాగేశ్వరరావు, నేలపాటి రాజబాబు తదితరులు శేషుబాబును అభినందించారు.

స్పందనకు 24 అర్జీలు



ఏఓకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 24 అర్జీలు వచ్చాయని కార్యాలయ ఏఓ యేడిద శ్రీనివాస్ అన్నారు. సమస్యల పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతామని ఏఓ తెలిపారు. భూసర్వే, ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయని చెప్పారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

పెనుగొండ: ఆచంట కచేరీ సెంటర్‌లో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో 16వ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు చదలవాడ ముత్యాలరావు, తానేటి చిన బుల్లియ్య, చిట్టిబాబు, దిగమర్తి ఆశీర్వాదం, గుబ్బల ప్రసాద్ బాబు, కడలి రామకృష్ణ, తాళ్లూరి ప్రభాకర్, కడలి సత్యనారాయణ, గుబ్బల సుబ్రహ్మణ్యం, నక్కా సూరిబాబు, టి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పప్పుగుంటలో వైద్య శిబిరం



పప్పుగుంటలో సేవలందిస్తున్న సిబ్బంది

పోడూరు: జగన్నాథపురం శివారు పప్పుగుంటలో సోమవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఆరోగ్యసిబ్బంది గ్రామంలో ఫీవర్ సర్వే చేశారు. జ్వరాలున్నవారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. మెడికల్ ఆఫీసర్ పూజ, ఏఎన్ఎం రాజకుమారి, ఆశా కార్యకర్తలు స్థానిక ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గ్రామసర్పంచ్ గుడాల శిరీష, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దిద్దే శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుధారాణి శిబిరాన్ని పర్యవేక్షించారు. హెల్త్ అసిస్టెంట్ కె.ప్రసాద్, ఆశా వర్కర్లు సుమతి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఓపీ కార్డుల వితరణ



ఆసుపత్రికి ఓపీ కార్డులు అందిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆచంటలో 30 పడకల ప్రభుత్వాసుపత్రికి మానవత ఆధ్వర్యంలో 30 ఓపీ కార్డులను అందించారు. సోమవారం ఆసుపత్రి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 5000 ఓపీ కార్డులను ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులకు అందించారు. మానవత అధ్యక్షుడు శివన్నారాయణ సతీష్ కుమార్, కార్యదర్శి బొక్కా రామకృష్ణ, మండల కన్వీనరు సంబూరి అంజిబాబు, మండల కో కన్వీనరు వై.శ్రీనివాస్, అడ్వయిజరీ కమిటీ సభ్యుడు కె.లీలా ప్రసాద్, ఆత్మీయ కమిటీ సభ్యుడు కేఎస్ శర్మ పాల్గొన్నారు.

ఉచిత శాంతిరథం ప్రారంభం



శాంతిరథాన్ని ప్రారంభిస్తున్న సుగుణమ్మ

పెనుమంట్ర: ఆలమూరుకు చెందిన స్వచ్ఛంద సేవా కార్యకర్త సత్తి చిరంజీవి తండ్రి సత్తి సత్యనారాయణరెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసిన ఉచిత శాంతి రథాన్ని మాతృమూర్తి సత్తి సుగుణమ్మ సోమవారం ప్రారంభించారు. అన్నికుల మతాల వారు అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఈ వాహనాన్ని ఉచితంగా సరఫరా చేస్తామని చిరంజీవిరెడ్డి చెప్పారు. సర్పంచ్ మేడపురెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.